క్లుప్తంగా

ఉగాది శుభాకాంక్షలు



అందెల శ్రీరాములును సన్మానిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: ఉగాది పండుగను పురస్కరించుకొని జల్‌పల్లి మున్సిపాలిటీ సబితా ఇంద్రారెడ్డి కాలనీకి చెందిన బీజేవైఎం నాయకుడు వీరబత్తిని రాజేందర్ సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు వడ్ల ప్రభాకర్‌చారి, కె.వెంకటేశ్, జి.శ్రీనివాస్, ఎం.చంద్రకాంత్ తదితరులతో కలిసి ఆయనకు శాలువా కప్పి సన్మానించారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: పాఠశాలల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా మారిందని గ్రామపెద్దలు కె.రాజాప్రతాప్‌రెడ్డి, ఎం.హన్మంత్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, ఎం.ఇంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని లేమూరు జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.4లక్షలతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం రాత్రి గ్రామస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైమాస్ట్ లైట్లు ఏర్పాటులో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ కృషి ఎంతో ఉందన్నారు. గ్రామస్తుల తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు జి.దర్శన్, ఎండీ రహీమ్, ఎండీ అఖిల్ అహ్మద్, కె.బలవంత్, జి.సుధాకర్, జి.మధుకర్‌రెడ్డి, ఎడ్ల రవీందర్, పి.వెంకటరెడ్డి, పి.వెంకటేశ్, బి.నవీన్, పి.ప్రవీణ్, జి.సాయికృష్ణ, ఎం.రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు గడువు ముగింపు



బడంగ్‌పేటలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

బడంగ్‌పేట్: మార్చి 31తో గడిచిన ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను చెల్లింపునకు గడువు ముగిసింది. 2024–25 ఏడాదికి రూ.39 కోట్ల టార్గెట్‌ను పెట్టుకున్నారు. అందులో భాగంగానే రూ. 20.91 కోట్లను వసూలు చేశారు. అందుకోసం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మేనేజర్, ఆర్వో అధికారులు, గ్రూప్–4 అధికారులు, సిబ్బంది నెల రోజులుగా శ్రమించారు. టార్గెట్‌లో సుమారు రూ.9 కోట్ల మేర పొల్ట్రీఫారాల బకాయిలే ఉన్నాయి. పౌల్ట్రీఫారాల జోలికి పోవద్దని ప్రభుత్వం నుంచి ఆంక్షలు ఉన్నాయి. 54 శాతానికి పైగా వసూలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు బకాయి పన్నులకు ప్రభుత్వం 90 శాతం వడ్డీ రాయితీ కల్పించింది. ఇంటి పన్ను, వ్యాపార పన్ను చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ పి.సరస్వతి కోరారు. సోమవారం ఒక్క రోజే రూ.48లక్షల ఇంటి పన్నులు వసూలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న సలీం తదితరులు

హుడాకాంప్లెక్స్: రంజాన్ పండుగ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు మహ్మద్ సలీం ఆధ్వర్యంలో సరూర్‌నగర్ చాడీలోని వృద్ధాశ్రమంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. దీంతో పాటు ఉగాది పండుగ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల అరవింద్ కుమార్, పుటం విజేందర్, భాగ్యలక్ష్మి, యశ్వంత్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, వీరేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పోలీసులు



మహేశ్వరం: మన్సాన్‌పల్లిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మీర్‌పేట: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

రంజాన్(ఈద్–ఉల్–ఫితర్) వేడుకలను సోమవారం మహేశ్వరం నియోజకవర్గంలోని ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయాన్నే ఈద్గాలు, మసీదులకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మతపెద్దలు దేవుడి సందేశాన్ని వివరించారు. అనంతరం కులమతాలకతీతంగా అలయ్ బలయ్ చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. వేలాది మంది పాల్గొన్న పహాడీషరీఫ్ ఈద్గా, షాహిన్‌నగర్ మర్కజ్‌ల వద్ద మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ నాగలక్ష్మి, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ పి.లక్ష్మీకాంతారెడ్డి, పహాడీషరీఫ్, బాలాపూర్‌ల ఇన్‌స్పెక్టర్లు గురువారెడ్డి, ఎం.సుధాకర్ బందోబస్తును పర్యవేక్షించారు.



పహాడీషరీఫ్ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పహాడీషరీఫ్: జల్‌పల్లిలో రంజాన్ ముబారక్ తెలుపుకొంటున్న ముస్లింలు



కందుకూరు: కొత్తగూడలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



కందుకూరు: సీఐ సీతారామ్‌కు జ్ఞాపికను అందిస్తున్న మత పెద్దలు



పహాడీషరీఫ్: రంజాన్ వేడుకల్లో ముస్లింలు



కందుకూరు: దాసర్లపల్లిలో శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ప్రజాప్రతినిధులు

నేడు ఎమ్మెల్యే పర్యటన

కేశంపేట: అమ్మ హస్తం పథకంలో భాగంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం మండల కేంద్రానికి వస్తున్నట్టు ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్యకర్తకు పరామర్శ

షాద్‌నగర్: ఇటీవల చెట్టుపై నుంచి పడి చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తను మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సోమవారం పరామర్శించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుర్వ బీరయ్య ఇటీవల చెట్టుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి, ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నాడు. ఆయన వెంట నాయకులు వంకాయల నారాయణరెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌నాయక్, నటరాజ్, వీరేశం గుప్తా, పిల్లి శేఖర్ తదితరులు ఉన్నారు.

వక్ఫ్ బిల్లు సవరణపై నిరసన

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాలలో ఈద్గా వద్ద ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రంజాన్ పండగ సందర్భంగా గ్రామం లో ఉన్న ఈద్గా వద్ద ప్రార్థనల అనంతరం ముస్లింలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని, వక్ఫ్ బిల్లును సవరించడం సరికాదన్నారు. వక్ఫ్ బిల్లు దేశ లౌకికవాదానికి సంబంధించిన అంశం అన్నారు. మతాలకతీతంగా అందరూ ఈ బిల్లును వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

రేపు మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



బోయిన్‌గుట్టతండాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జైపాల్‌యాదవ్ తదితరులు

కడ్తాల్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పర్యటనను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. 2న మండల పరిధి బోయిన్‌గుట్ట, ముద్విన్ గ్రామాలకు హరీశ్ రానున్న నేపథ్యంలో సోమవారం ఆయా గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి తదితరులతో కలిసి పర్యటించారు. బోయిన్‌గుట్ట తండాలో సేవాలాల్ మహరాజ్, మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ, ముద్విన్‌లో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద కుటుంబానికి నిర్మించిన నూతన భవనాన్ని మాజీ మంత్రి ప్రారంభించనుండగా.. ఆయా ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్సింహగౌడ్, రవీందర్‌రెడ్డి, జంగయ్య, యాదయ్య, హరిచంద్‌నాయక్, మాజీ ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, రమేశ్, నాయకులు జోగు వీరయ్య, రామకృష్ణ, జంగయ్య, శ్రీను, అంజి, సోమ్లా, రాజేశ్, వినోద్, గోపాల్, వెంకటయ్య, రాజు, పర్వతాలు తదితరులు ఉన్నారు.

నేడు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తారని ఆయా మండలాల అధ్యక్షులు కృష్ణారెడ్డి, కావలి రాజు సోమవారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు కొందుర్గు 2, 3 చౌకధర దుకాణాల్లో బియ్యం పంపిణీ ప్రారంభిస్తారని కృష్ణారెడ్డి తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 1 గంటలకు చౌదరిగూడ 1వ దుకాణంలో బియ్యం పంపిణీ ప్రారంభిస్తారని రాజు పేర్కొన్నారు. ఈ కార్క్రమానికి రేషన్‌కార్డుదారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



యాదగిరిని సన్మానిస్తున్న విశ్వకర్మ సంఘం సభ్యులు

మొయినాబాద్‌రూరల్: రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కాసోజు యాదగిరిని విశ్వకర్మ సంఘం సభ్యుడు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌కు చెందిన కాసోజు యాదగిరి రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలుపొందాడు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం మండల సభ్యుడు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో కాసోజు యాదగిరిని సోమవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన యాదగిరి మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో ప్రజలకు అన్యాయం జరగకుండా చూడడానికి కృషిచేస్తానని తెలిపారు. రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో తాను అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా తనను గౌరవించి సన్మానించినందుకు విశ్వకర్మ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తమ వంతు సహాయంగా విశ్వకర్మ సంఘంలో పనిచేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బాకారం శ్రీనివాసచారి, జి.ప్రవీణ్, రాంరెడ్డి, ప్రేమ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కొత్తూరు మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో పెట్టుకొని అధికారులు పట్టణంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా మరమ్మతులు చేపట్టాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి కాలనీలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడూ నిర్వహించాలని, డ్రైనేజీలను శుభ్రం చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. కొన్ని కాలనీల్లో విద్యుత్ లైట్లు లేకపోవడంతో చీకటిగా ఉంటుందని, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పనిచేయని విద్యుత్ దీపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా మున్సిపల్ ఆదాయం పెంచే విధంగా అధికారులు దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కళాశాల అధ్యాపకుడికి సన్మానం



రాంబాబు దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

మీర్‌పేట: మీర్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డా.రామడుగు రాంబాబు పదవీ విరమణ పొందిన సందర్భంగా సోమవారం సిబ్బంది కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా రాంబాబు అధ్యాపక వృత్తిలో చేసిన సేవలను కొనియాడారు. ఆయన శేష జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం రాంబాబు దంపతులను తోటి అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నర్సింహాచార్యుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎయిడెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర నాయకురాలు హేమలత, స్టాఫ్ సెక్రటరీ వనమాల శ్రీధర్, ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, పూర్వ ప్రిన్సిపాల్ సైదులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

గ్రహణం వీడింది.. విస్తరణ పెరిగింది

గుంతలు, ఇరుకు రోడ్డుకు గ్రహణం వీడింది. సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన తుమ్మలూరు–మహేశ్వరం రహదారి విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. వేగంగా కొనసాగుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులు తీరనున్నాయి. నియోజకవర్గ పరిధి మండలాల ప్రజలకు దూరభారం తగ్గనుంది.

- వేగంగా మహేశ్వరం బీటీరోడ్డు నిర్మాణం
- 33 ఫీట్ల వెడల్పు, 5.1కి.మీ రోడ్డుకు రూ.14.20 కోట్లు మంజూరు
- డబుల్ రోడ్డుతో తీరనున్న వాహనదారుల కష్టాలు
- హర్షం వ్యక్తంచేస్తున్న ప్రజలు



కొనసాగుతున్న తుమ్మలూరు- మహేశ్వరం బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు



తుమ్మలూరులో సీసీరోడ్డు నిర్మాణం

మహేశ్వరం: తుమ్మలూరు– మహేశ్వరం మండల కేంద్రం వరకు 5.1 కిలో మీటర్ల దూరానికి, 33 ఫీట్ల రహదారి విస్తరణకు ప్రభుత్వం రూ.14 కోట్ల 20 లక్షలు మంజూరు చేసింది. దీంతో ఇప్పటి వరకు శ్రీశైలం హైవే(తుమ్మలూరు గేటు)– నుంచి తుమ్మలూరు ఏనా(కట్ట) వరకు 1.5 కి.మీ. బీటీ నిర్మాణం పూర్తయింది. ఇంకా 3.6 కి.మీ దూరం పెండింగ్‌లో ఉంది. చాలా కాలంగా బీటీ పనుల్లో కదలిక రాకపోవడంతో.. ఇదే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు, ప్రాంత యువకులు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌కు విన్నవించారు. అనంతరం ఆయన ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి.. రోడ్డు పనులు పూర్తిచేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించగా.. విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.

వాహనాలను మళ్లిస్తూ..

ఈ రోడ్డు గతంలో 20 ఫీట్ల వెడల్పు ఉండేది. ప్రస్తుతం 33 ఫీట్ల వెడల్పు, రోడ్డుకు ఇరు వైపులా 5 ఫీట్ల సైడ్‌బర్మ్ నిర్మాణం చేపట్టనున్నారు. దారి అభివృద్ధితో మహేశ్వరంతో పాటు కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల ప్రజలకు మహేశ్వరం మండలం, బెంగళూరు జాతీయ రహదారి వైపు వెళ్లడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా రహదారి నిర్మాణానికి అనువుగా.. గుంతలను పూడ్చి, కంకర పోసి చదును చేశారు. మార్గ మధ్యలో కల్వర్టులను నిర్మించారు. తుమ్మలూరు గ్రామ పంచాయతీ ఎదుట నుంచి జెడ్పీ హైస్కూల్ వరకు సీసీరోడ్డును నిర్మించారు. ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని వాహనాలను మళ్లిస్తూ.. నిర్మాణ పనులను వేగిరం చేశారు. పనులను ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు, డీఈ రమేష్ గౌడ్, ఏఈలు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

'డబుల్' అభివృద్ధి



ఇరుకు రోడ్డుతో వాహనదారులు ఇబ్బంది పడేవారు. 5.1 కి.మీ. బీటీ డబుల్ రోడ్డు నిర్మాణంతో బెంగుళూరు జాతీయ రహదారి వైపు దూసుకుపోయే వాహనదారులకు సౌకర్యవంతంగా ఉంటుంది. గ్రామం మరింత అభివృద్ధి చెందుతుంది. నియోజకవర్గ పరిధి మండలాల ప్రజలకు దూరం భారం తగ్గనుంది.

– కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, తుమ్మలూరు

రవాణా సౌకర్యం మెరుగు



మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ చొరవ, మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలతో రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గుంతలు, ఇరుకైన రోడ్డు అభివృద్ధితో రవాణా సౌకర్యం మెరుగు పడటంతో పాటు.. వాహనదారులు, ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి.

– ప్రశాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు, తుమ్మలూరు

పర్యవేక్షిస్తున్నాం

తుమ్మలూరు– మహేశ్వరం రహదారి విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు తుమ్మలూరు గేటు నుంచి ఏనా(కట్ట) వరకు 1.5 కి.మీ. మేర పూర్తయింది. ఇంకా 3.6 కిలో మీటర్లు నిర్మాణం కావాల్సి ఉంది. పనులు వేగంగా కొనసాగుతున్నాయి. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. త్వరలో వినియోగంలోకి తెస్తాం. ప్రజలు, వాహనదారులు సహకరించాలి.

– రవీందర్ గౌడ్, ఆర్‌అండ్‌బీ డీఈ, మహేశ్వరం